# సెస్ ఆదాయంపై బహిరంగ విచారణ

**సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే:** సెస్‌లో నష్టాలు తగ్గించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని సెస్ ఎండీ విజయేందర్‌రెడ్డిని ఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ డి.నాగార్జున్ ప్రశ్నించారు. మంగళవారం సిరిసిల్ల సహకార విద్యుత్తు సరఫరా సంఘం 2025-26 సంవత్సరానికి వార్షిక ఆదాయ ఆవశ్యకత, ఛార్జీల నుంచి అంచనా ఆదాయంపై పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలో బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా సెస్‌ను ఆదాయ బాటలో నడిపించడానికి తీసుకుంటున్న చర్యలు, సెస్‌లో గత సంవత్సరం ఆదాయ వ్యయాలతో పాటు విద్యుదాఘాతంతో మరణించిన వారికి నష్టపరిహారం, పెండింగ్‌లో ఉన్న బిల్లుల రికవరీ తదితర నివేదికను సెస్‌ఎండీ చదివి వినిపించారు. అనంతరం సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ.. 55 సంవత్సరాలుగా వినియోగదారులకు మెరుగైన విద్యుత్తు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ 208.44 కోట్ల ఆదాయ అంచనాలను కమిషన్‌కు సమర్పించామన్నారు. సమావేశంలో వివిధ సమస్యలపై 270 దరఖాస్తులు స్వీకరించగా, వీటిలో కుటీరపరిశ్రమల పవర్‌లూం యజమానుల సంఘం నుంచి 143 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ డి.నాగార్జున్

## ఎన్పీడీసీఎల్‌లో విలీనం చేయాలి

సెస్ వార్షిక ఆదాయ ఆవశ్యకత, ఛార్జీల అంచనా ఆదాయంపై నిర్వహించిన బహిరంగ విచారణలో పలువురు వినియోగదారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జోగినిపల్లి సంపత్‌రావు మాట్లాడుతూ.. గతంలో నిర్వహించిన బహిరంగ సభలో సెస్ నష్టాల బాటలో ఉంది. దీనిని వెంటనే ఎన్పీడీసీఎల్‌లో విలీనం చేయాలని ఈఆర్‌సీకి నివేదిక ఇచ్చామని తెలిపారు. ప్రతి ఇంటికి 2 నుంచి 3 విద్యుత్తు కనెక్షన్లు ఇస్తున్నారని.. మీటర్లు కాలిపోయినా వాటిని మార్చడం లేదని జశ్వంత్‌రెడ్డి అన్నారు. వేలాడుతున్న విద్యుత్తు వైర్లను సరిచేయాలని చాలా సార్లు ఫిర్యాదు చేశామని ఎవరూ పట్టించుకోవడం లేదని ఓరుగంటి రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెస్ అధికారులు, సిబ్బంది, వినియోగదారులు, సెస్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రభ

# రాజన్న సేవలో స్టేట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్



రాజన్న ప్రసాదం అందిస్తున్న ఈఓ వినోద్

**వేములవాడ, మార్చి 18 (ఆంధ్రప్రభ) :** స్టేట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్, రిటైర్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ మంగళవారం శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ముందుగా వారికి ఆలయ అర్చకులు వేద పండితులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం తర్వాత అర్చకులు వారిని ఆశీర్వదించగా ఈవో లడ్డు ప్రసాదం అంద జేశారు. కోడె మొక్కులు సైతం చెల్లించుకోని సేవలో తరించారు. ఆలయ ఏఈఓ బ్రహ్మన్నగారి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీకాంతా చారి, ఆలయ ఇన్స్పెక్టర్, జూనియర్ అసిస్టెంట్ సింహాచారి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.